గొడ్లకు గడ్డుకాలం

- మిషన్లతో వరికోత
- పశువులకు గడ్డి కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.12 వేల నుంచి రూ.15 వేలు
- పాడి రైతులకు తప్పని కష్టాలు


ట్రాక్టర్‌లో వరిగడ్డిని తీసుకెళుతున్న రైతులు

కలసపాడు : పాడి రైతులకు గడ్డు రోజులు ఎదురవుతున్నాయి. ఎండు గడ్డి కొరత తీవ్రంగా ఉండటంతో పశుపోషణ రోజురోజుకు భారంగా మారుతోంది. కూలీల కొరత తీవ్రంగా వేధిస్తుండటంతో పశుగ్రాసం కొరత తీవ్రమవుతుంది.

కూలీల కొరతతో..

మండలంలో పాడిపై ఆధారపడి రైతులు ఎక్కువగా ఉన్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వచ్చే వరిగడ్డి పశువుల మేతకు రైతులు ఉపయోగిస్తారు. వరిసాగు చేసిన రైతులు కూలీలతో పంటను కోయించకుండా మిషన్లతో వరిపంటను కోయిస్తున్నారు. కొందరు రైతులు గడ్డిని పంట పొలాల్లోనే దగ్ధం చేస్తున్నారు. మండలంలో ఇదివరకు అన్ని గ్రామాల్లో వరిపంటను సాగు చేయడంతో వరిగడ్డి పుష్కలంగా లభించేది. ఇప్పుడు కొందరే సాగు చేయడంతో వరిగడ్డి కొరత తీవ్రంగా ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వరిసాగు చేయగా మరికొన్ని గ్రామాల్లో వరికి బదులు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న పాడి రైతులు వరిగడ్డి కోసం ఇతర జిల్లాలు, పక్క మండలాల నుంచి లారీలు, ట్రాక్టర్లతో తెచ్చుకుంటున్నారు. వరిగడ్డి కొరత ఎక్కువగా ఉండటంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. పాడి రైతులు వరిగడ్డిని కొనలేక ఎక్కువ శాతం పచ్చిమేత, మొక్కజొన్న సొప్ప మీద ఆధారపడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా దాణాలు

వరిగడ్డి ధరలు ఈ సీజన్‌లో రెట్టింపు ధర పలుకుతుంది. గతంలో ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ. 4 వేల నుంచి రూ.6 వేలు కాగా ఈ సీజన్‌లో రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు, లారీ వరిగడ్డి సుమారు రూ.18 వేల నుంచి రూ.25 వేల వరకు పెరిగింది. దీంతో రైతులకు వరిగడ్డి దొరకక పశుపోషణ భారంగా మారింది. పాడిరైతులు వరిగడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సొప్ప, పచ్చిగడ్డి గ్రాసాలతో పాటు దాణాలను వాడుతున్నారు.

కొండెక్కిన దాణా ధరలు

మార్కెట్‌లో పశువుల దాణా ధరలు విపరీతంగా పెరిగాయి. శనగచెక్క, కొబ్బరిపిట్టు, పెసరపొట్టు, పచ్చిచెక్క, మినపపొట్టుతో పాటు పలు దాణా రకాల ధరలు పెరిగాయి. కొంత మంది పాడి రైతులు పాల నుంచి లాభాలు రాకున్నా పశువులకు అప్పులు చేసి పశుగ్రాసం, దాణాలు పెడుతున్నారు. గతంలో పశుసంవర్ధకశాఖ ద్వారా పాడి రైతులకు గడ్డి విత్తనాలు అందజేసేవారు. ఇప్పుడు కొంతమందికే ఇచ్చారని, మిగిలిన రైతులకు విత్తనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

కొనలేని పరిస్థితి



ఈ సంవత్సరం వరి ఎండుగడ్డి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రోజూ పశువులకు పచ్చి మేతతో పాటు కొంత వరి ఎండుగడ్డి వేసేవాళ్లం. ఇప్పుడు ఎండుగడ్డి ధరలు పెరగడంతో కొనలేని పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో ఎండుగడ్డిని అప్పులు చేసి అధిక ధరకు కొనుగోలు చేసి పశువులకు మేతగా వేస్తున్నాం.

–బక్కిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పాడిరైతు, మామిళ్లపల్లె, కలసపాడు మండలం

భారంగా పశుపోషణ



కూలీల కొరత కారణంగా వరి ఎండుగడ్డికి భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సొప్ప, పచ్చిమేతతో పాటు ఇతర పశుగ్రాసాలను పశువులకు మేతగా వేస్తున్నాం. ప్రస్తుతం దాణా ధరలు విపరీతంగా పెరగడంతో పశుపోషణ పాడి రైతులకు భారంగా మారింది. పాడిపరిశ్రమతో నష్టాలు వస్తున్నా నెట్టుకొస్తున్నాం.

–పాలకొలను నారాయణరెడ్డి, పాడిరైతు, సిద్ధమూర్తిపల్లె, కలసపాడు మండలం

పచ్చిమేత వేసుకోవాలి



ఎండుగడ్డి లేని సమయంలో పచ్చిమేత సొప్ప వేసుకుని పాడి పశువులను పోషించుకుంటే మంచి పోషకాలు లభిస్తాయి. ఎండుగడ్డిని వరి పంట కోయగానే నిల్వ చేసుకుంటే కొరత ఉన్న సమయంలో పాడి రైతులకు ఉపయోగపడుతుంది. ఈ సీజన్‌లో ఎండుగడ్డికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

–ఎ.వెంకటేశ్వర్‌రావు, పశువైద్యాధికారి, కలసపాడు

క్లుప్తంగా

నేటి నుంచి భక్తి ప్రవచనాలు

ప్రొద్దుటూరు : శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు ఆధ్యాత్మిక, భక్తి ప్రవచనాల కార్యక్రమం ఏర్పాటు చేశామని ట్రస్టు నిర్వాహకులు పూజ్య స్వామినీ శివదర్శనానంద సరస్వతి మాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. శివ మహాపురాణం గ్రంథంలోని ప్రవచనాలను చెప్పడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. రోజు సాయంత్రం 6.15 గంటల నుంచి 7.45 గంటల వరకు రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. వివరాలకు 7075883536 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2025–26 సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకునేందుకు ఈనెల 6వ తేదీ వరకు ఉన్న గడువును ఈనెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9000697778 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మాజీ సర్పంచ్ మృతి


మల్లు సుబ్బారెడ్డి(ఫైల్)

అట్లూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు తంబళ్లగొంది మాజీ సర్పంచ్ మల్లు సుబ్బారెడ్డి (70) ఆదివారం మృతి చెందారు. మల్లు సుబ్బారెడ్డి తంబళ్లగొంది మాజీ సర్పంచ్‌గా కమలకూరు సింగిల్‌విండో అధ్యక్షుడిగా పనిచేశారు. తంబళ్లగొంది పంచాయతీలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారు. గత ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ గెలుపులో ఈయన కీలక పాత్ర పోషించారు. రెండు రోజుల క్రితం అకస్మాత్తుగా బీపీ పెరిగి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం కడపకు తరలించారు. తలలో రక్తం గడ్డకట్టిందని వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

మహిళా లీడర్లకు సన్మానం


మహిళా లీడర్లను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మహిళా లీడర్లకు పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి, శాంతి, నీతమ్మ, అన్నపూర్ణ, మరియమ్మ ఉన్నారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్ మాట్లాడుతూ మహిళలు చదువుకుని అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు.

వాగుగట్టుపై చెలరేగిన మంటలు


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజుపాళెం : మండల పరిధిలోని అర్కటవేముల గ్రామ సమీపంలోని ఉన్న తాళ్లవాగు గట్టుపై ఆదివారం రాత్రి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ సమాచారాన్ని గ్రామస్తులు ప్రొద్దుటూరులోని అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. మంటలు పక్కనే ఉన్న పెట్రోబంకు సమీపానికి రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. వెంటనే గ్రామంలో ఉన్న కొంత మంది ట్రాక్టర్‌కు ఉన్న మందు పంపు సహాయంతో ఫైర్ ఇంజన్ వచ్చే వరకు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అనంతరం అగ్నిమాపక యంత్రం, సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలు అరెస్ట్.. విడుదల

మైదుకూరు : సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో సోమవారం నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను మైదుకూరు అర్బన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి సీపీఎం అనుబంధ సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ 'చలో విజయవాడ' ప్రకటించిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం మైదుకూరు మున్సిపాలిటీ, మండలానికి చెందిన 20 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు రైలు ఎక్కేందుకు కడపకు వెళ్లడానికి సిద్ధపడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో అసోసియేషన్ లీడర్లు, ఎ.ధనలక్ష్మి, కె.వెంకటసుబ్బమ్మ, జి.లక్ష్మీదేవి, ఎం.లక్ష్మీదేవి తదితరుల వివరాలను తీసుకున్న పోలీసులు అందరినీ ఇళ్లకు పంపారు.

మొల్ల కీర్తి తెలుగు సాహితీ జగత్తుకే స్ఫూర్తి


పెద్దిరెడ్డి నీలవేణిని సత్కరిస్తున్న హనుమంతరావు తదితరులు

బద్వేలు అర్బన్ : తెలుగు సాహిత్యంలో ధృవతార లాంటి మొల్ల కీర్తి తెలుగు సాహితీ జగత్తుకే స్ఫూర్తి అని నందలూరు ఉన్నత పాఠశాల ఆంధ్రోపన్యాసకురాలు పెద్దిరెడ్డి నీలవేణి పేర్కొన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని పెన్షనర్స్ భవనంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన మొల్ల జయంతి సభలో ఆమె మాట్లాడుతూ తెలుగు రామాయణ తొలి కవయిత్రి మొల్లమాంబ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు ధన్యులని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ ఎస్‌ఐ రవికుమార్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మొల్ల రామయణానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఆమె బద్వేలు సమీపంలోని గోపవరం నివాసి కావడం తెలుగు ప్రజల అదృష్టమన్నారు. తొలుత కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణికి మొల్ల సాహితీసేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. కడపలో మొల్లమాంబ పేరుతో తెలుగు అకాడమీని నెలకొల్పి గోపవరం మండలానికి మొల్లపేరు పెట్టాలని, అలాగే ఆమె ఆరాధించిన శ్రీకంఠమల్లేశ్వర, రామాలయాలను జీర్ణోద్ధారణ గావించి పునర్నిర్మాణం చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


సునీల్ (ఫైల్)

కలసపాడు : మండలంలోని అక్కిసిద్దుపల్లె గ్రామానికి చెందిన కోనేటిసునీల్ (24) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ ఘనమద్దిలేటి తెలిపిన వివరాల మేరకు.. సునీల్ వరికోత మిషన్ తెచ్చుకుని మిషన్‌ను చూసుకోకుండా సెల్ ఫోన్ చూసుకుంటూ ఉండటంతో తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు హల్‌చల్

జమ్మలమడుగు రూరల్ : మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న సంజామల మోటు వద్ద హల్ చల్ చేశాడు. ఆదివారం మధ్యాహ్నం మద్యం మత్తులో షర్ట్‌ను తీసివేసి ప్రధాన రోడ్డుపై వస్తున్న బస్సులను, లారీలను, కార్లను బైక్‌లను అడ్డుకుని డబ్బుల కోసం వాహనదారులను వేధించాడు. రోడ్డుకు అడ్డంగా కూర్చొని రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించాడు. ప్రజలు ఎంత చెప్పిన వినకుండా రోడ్డుపై భైఠాయించాడు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని సాధన ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పురపాలక సంఘంలో పనిచేస్తున్న మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు అవకాశమిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారని, వ్యవసాయం నుండి అంతరిక్షం వరకు సకల రంగాల్లోను స్త్రీలు సమున్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. మహిళల మీద రోజురోజుకు హింస, వేధింపులు పెరుగుతున్నాయని, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, శ్రమ దోపిడీకి గురవుతున్నారని, వీటన్నింటిని పాలకులు అరికట్టాలని కోరారు. మద్యాన్ని అరికట్టాల్సిన పాలకులు దానిని ఆదాయ వనరుగా చూడటం దుర్మార్గమన్నారు. సాధన ఇంగ్లీషు మీడియం కరస్పాండెంట్ సముద్రాల శ్రీనివాసులు, ఐద్వా పట్టణ కార్యదర్శి రత్నమ్మ, డీవైఎఫ్ఐ పట్టణ, రూరల్ అధ్యక్షులు మస్తాన్‌షరీఫ్, ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యువరాజు, బాదుల్లా, రాజు, మహిళా కన్వీనర్ గురుదేవి, కో కన్వీనర్లు ఫాతిమా, నాగేశ్వరి, హరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

కడప వైఎస్ఆర్ సర్కిల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్వాడీలు ఈ నెల 10న చేపట్టిన చలో విజయవాడను అడ్డుకునేందుకు అరెస్టు చేయడం తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఈ చర్యలు ప్రభుత్వానికి మంచిది కాదని హితవు పలికారు. ఈ సమావేశంలో జి.వేణుగోపాల్, కేసీ.బాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం.. ఆర్థిక లాభం

- కుసుమ సాగుపై పెరుగుతున్న రైతుల ఆసక్తి
- పెట్టుబడి కూలీల అవసరం తక్కువ

రాజుపాళెం : ఔషధ మొక్కగా, నూనెగింజ పంటగా విశిష్ట ప్రాధాన్యత కలిగిన పంట కుసుమ. చల్లని వాతావరణంలో అధిక దిగుబడినిచ్చే ఈ పంటలో ఆదాయం తక్కువగా ఉండటం, మొక్కకు ముళ్లు అధికంగా ఉండటం, పంట కోతకు కూలీలు దొరకక పోవటం వల్ల క్రమేపి దీని సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. అయితే ఇటీవలి కాలంలో కుసుమ నూనెకు గిరాకీ పెరగటంతో ఈ పంట భవిష్యత్ ఆశాజనకంగా కన్పిస్తోంది. ఆరోగ్య పదాయనిగా, ఆర్థిక పంటగా కుసుమ ప్రసిద్ధి పొందింది. నూనెగింజ పంటల్లో బహుళ ప్రయోజనాలతో ఆకర్షిస్తున్న పంట కుసుమ. ఈ నూనె ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి సాధించవచ్చని రైతులు చెబుతున్నారు.

పొడి వాతావరణం అనుకూలం

దీని శాస్త్రీయనామం కార్థమస్ టింక్టోరియస్. దీని ఆకులు వాడిగా ఉన్న ముళ్లను కలిగి ఉంటాయి. మొక్కలు 30 నుంచి 150 సెంటీమీటర్ల ఎత్తు వరకూ పెరుగుతాయి. కుసుమను ఇంగ్లీషులో శాఫ్ ఫ్లవర్ అంటారు. పూలు గుండ్రని ఆకారము కలిగి పచ్చటి పసుపు, నారింజ, ఎరుపు లేక తెలుపు రంగుల్లో ఉంటాయి. ఒక్కో పువ్వులో 15–20 గింజలు ఉంటాయి. ఈ మొక్క తల్లి వేరు దృఢంగా ఉండడం వలన పొడి వాతావరణాన్ని బాగా తట్టుకోగలదు. కానీ కాండం పెరిగే దశ నుంచి మొక్క పూర్తిగా ఎదిగే వరకూ మంచును ఎంత మాత్రం తట్టుకోలేదు.

మార్కెట్‌లో మంచి ధర

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన మినుము పంట అరకొరగా దిగుబడులు రావడంతో నూర్పిడి అనంతరం కొర్ర, కుసుమ పంటలను సాగు చేశారు. ప్రస్తుతం కుసుమ పంట పూత దశలో ఉంది. మండలంలోని పలు గ్రామాల్లో ఈ పంటను విస్తారంగా సాగు చేశారు. ఈ పంట 110 నుంచి 120 రోజుల్లో పూర్తవుతుందని, ఎకరాకు 3 నుంచి 4 కిలోలు విత్తనం అవసరమవుతుంది. దిగుబడి ఎకరాకు సరాసరి 5 నుంచి 6 క్వింటాళ్లు రావచ్చునని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి ధర ఉన్నట్లు వ్యాపారులు తెలిపారు. పంటకు అంతా ముళ్లలు, ముళ్లలు ఉంటుంది. అనువైన మిషన్‌లు రావడంతో నూర్పిడి సులభతరం అవుతుందని రైతులు తెలిపారు.


కుసుమ పువ్వులు


సాగులో ఉన్న తెల్ల కుసుమ

విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి గురికావద్దు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కుమారస్వామి గుప్తా

పోరుమామిళ్ల: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మానసిక ఒత్తిడికి గురికావద్దని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా అన్నారు. ఆదివారం జరిగిన స్థానిక వెంగమాంబ ఉన్నత పాఠశాల 21 వ వార్షికోత్సవ వేడుకలు, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాల చైర్మన్ పుల్లపనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో సీఐ శ్రీనివాసులు, కవి, ఉపాధ్యాయుడు గొంటుముక్కల గోవిందు, రచయిత, ఉపాధ్యాయుడు బొల్లు రామ్మోహన్, పశువైద్యులు వెంకటసుబ్బయ్య పాల్గొని విద్యార్థులకు మంచిమార్గంలో నడవాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు కుమారస్వామి గుప్తా బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ నాగలింగేశ్వర రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయలసీమ సమగ్రాభివృద్ధికి పాటుపడాలి


సమగ్రాభివృద్ధి చర్చా వేదికలో సంఘటితంగా నాయకులు

ప్రొద్దుటూరు : రాయలసీమ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ నాగరాజు, రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ ఆధ్వర్యంలో స్థానిక శారద జూనియర్ కాలేజీలో ఆదివారం రాయలసీమ సమగ్రాభివృద్ధిపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుమార్లు శంకుస్థాపనలు చేసినా ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను నిర్మించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని తెలిపారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీరు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు ఓబయ్య, ఏపీ దళిత సంఖ్య నాయకుడు యల్లయ్య, ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగేంద్ర, ఆటో కార్మిక సంఘం ప్రతినిధులు భాస్కర్, మహబూబ్ బాషా, రైతు నాయకులు వీరనారాయణరెడ్డి, సహదేవరెడ్డి, రామాంజనేయరెడ్డి, శ్రీను, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్రనాయకుడు ఎరుకుల ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సైదా గారి వీధిలో ఉన్న మన ప్రజా సేవామితి కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్, ఎంజీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయూబ్ ఖాన్ 40 మంది పారిశుద్ధ్య కార్మికులు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, దౌర్జన్యాలను ప్రభుత్వం కఠినమైన చట్టాలతో అరికట్టాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ముక్తియార్, అస్లాం, సద్భావన సేవా సంఘం కార్యదర్శి శేఖర్, మన ప్రజాసేవా సమితి ఉపాధ్యక్షుడు బీటెక్ బాషా, కింగ్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖలీద్, ట్రెజరర్ మహమూద్, ఫర్హాన్ పాల్గొన్నారు.

ఎన్జీఓ మహిళా విభాగం కార్యవర్గం ఎన్నిక


మహిళా విభాగం కార్యవర్గంతో ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు

మైదుకూరు : మైదుకూరు తాలూకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మహిళా విభాగం కార్యవర్గాన్ని ఆదివారం మైదుకూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలిగా టీఎం సువర్ణ (వైద్య ఆరోగ్యశాఖ), కన్వీనర్లుగా పి.సుజాత (అర్బన్ హెల్త్ సెంటర్), కె.ఉమ (మండల పరిషత్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలుగా పి.స్వర్ణలత (వైద్య ఆరోగ్యశాఖ), ఎం.యశోద(పశుసంవర్ధకశాఖ), ఎస్.వసుంధర, సంయుక్త కార్యదర్శులుగా దీవెనమ్మ, సి.కల్పన(మహిళా పోలీసులు), ప్రశాంతి (వైద్య ఆరోగ్యశాఖ)లు ఎన్నికైనట్టు మైదుకూరు ఏపీ ఎన్జీఓ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు గజ్జల చంద్రమౌళి, మాచనూరు రాఘవయ్య ప్రకటించారు. తొలుత బద్వేలు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్‌ను మైదుకూరు తాలూకా ఏపీ ఎన్జీఓ గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కోశాధికారి లక్కినేని బాబు, ఉపాధ్యక్షుడు పెంచల్ రెడ్డి, పీవీవీ ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని 21–24 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని సర్కిల్ –1 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పావని, సర్కిల్ –2 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శౌధర్‌రెడ్డి ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకానికి ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పూర్తి చేసిన వారు తమ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వారి విద్యార్హతను బట్టి వివిధ కంపెనీల్లో ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ ఇస్తారన్నారు. ఇంటర్న్‌షిప్‌లో నెలకు రూ.5వేలు స్టైఫండ్‌తోపాటు ఆ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఫోన్‌నంబర్, సబంధిత సర్టిఫికెట్లతో సహాయ కార్మిక అధికారి కార్యాలయం ప్రొద్దుటూరు సర్కిల్ 1, 2 సంప్రదించాలని వారు కోరారు.